క్లుప్తంగా

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రముఖ యోగా గురువు మల్లా సుధాకరరావు అన్నారు. శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన 909వ శిక్షణ శిబిరం ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లా సుధాకరరావు మాట్లాడుతూ భారతీయ సనాతన సంప్రదాయాల్లో యోగ చాలా ప్రాచీనమైనదన్నారు. నిరంతరం యోగా సాధనతో అనేక దీర్ఘకాలిక వ్యాధులను సైతం నయం చేయవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరి నిత్య జీవనంలో యోగా ఒక భాగం కావాలన్నారు. ప్రతి రోజూ యోగా సాధన చేయటం ద్వారా కేవలం శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యం సైతం లభిస్తుందని వివరించారు. యోగా శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరూ దానిని నిరంతరం సాధన చేయాలని సూచించారు. ప్రతి రోజు కొద్దిసేపు యోగాకు సమయాన్ని కేటాయించటం ద్వారా మంచి ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని వివరించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ నిత్యం యోగా సాధన చేయవచ్చని పేర్కొన్నారు. యోగా సాధనతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వెల్లడించారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో శనగపల్లి సత్యనారాయణ, కందుకూరి రమేష్, తుమ్మలపెంట రమేష్ , తుమ్మలపెంట రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

పశ్చిమంలో పోలింగ్‌కు సర్వం సిద్ధం

నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,55,963 మంది

- 253 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- 153 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తింపు
- పలు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌గా గాంధీజీ వీఎంసీ హైస్కూల్



పశ్చిమ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సామగ్రిని తీసుకునేందుకు తరలివచ్చిన పోలింగ్ సిబ్బంది

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం పోలింగ్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 2,55,963 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 1,26,634, మహిళలు 1,29,296, ఇతరులు 33 మంది ఉన్నారు. వీరంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థికి, లోక్‌సభ స్థానానికి మరో అభ్యర్థికి రెండు ఓట్లు వేయాల్సి ఉంటుంది. అందులో భాగంగా పశ్చిమ ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా అధికారులు 253 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. భవానీపురం మొదటి పోలింగ్ కేంద్రం కాగా కేదారేశ్వరపేటలోని చివరి కేంద్రంగా ఉంది. నియోజకవర్గంలో ఎక్కడా ఎటువలంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

153 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు..

పశ్చిమ నియోజకవర్గంలో 253 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 153 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక కేంద్రాలుగా అధికారులు ప్రకటించారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద పూర్తి స్థాయిలో వెబ్ కాస్టింగ్ పని చేస్తుందని అధికారులు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు విస్తృతమైన బందోబస్తుతో పాటుగా పలు ప్రత్యేక అంశాలపై దృష్టిని కేంద్రీకరించే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఏదైనా సమస్య ఉత్పన్నమవుతే తక్షణం స్పందించే దిశగా అవసరమైన సిబ్బందిని అక్కడ అందుబాటులో ఉంచుతున్నారు.

ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు...

పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్ పలు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలో పలు పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. యువత, హరిత, మహిళ, విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తూ ఆయా ప్రత్యేక బూతులను ఏర్పాటు చేశారు. అందులో నియోజకవర్గంలోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో ఉన్న 149 పోలింగ్ కేంద్రాన్ని హరిత పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. అలాగే విద్యాధరపురంలోని గవర్నమెంట్ జూనియర్ కళాశాల (ఉర్దూ) ప్రాంగణంలోని 80వ నెంబర్ పోలింగ్ కేంద్రాన్ని యువ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. చిట్టినగర్‌లోని టిన్నర్ మెమోరియల్ హైస్కూల్ ప్రాంగణంలోని 114 పోలింగ్ కేంద్రాన్ని పింక్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. భవానీపురంలోని హజరత్ సయ్యద్ గాలిబా షాహెద్ దర్గా మేనేజమెంట్ కమిటీ షెడ్ ప్రాంగణంలో 37వ నెంబర్ పోలింగ్ కేంద్రాన్ని విభిన్న ప్రతిభావంతుల పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు.

సుమారు 1600 మంది సిబ్బంది..

నియోజకవర్గంలోని 253 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి సుమారు 1600 మందికి పైగా సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఒక్కో బూత్‌లో కనీసంగా ఆరుగురు పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తారు. వీరు కాకుండా పోలీసు ఇతర శాఖల సిబ్బంది అదనంగా వారివారి శాఖలకు చెందిన విధులు నిర్వహించనున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఆయా విధుల వారీగా రిజర్వులో పలువురు సిబ్బందిని సైతం అధికారులు అందుబాటులో ఉంచారు. వృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు సేవలందించేందుకు ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలను ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఈ ఎన్నికల్లో వినియోగించుకుంటున్నారు.

డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌గా గాంధీజీ స్కూల్

గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణాన్ని పశ్చిమ నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌గా అధికారులు నిర్ణయించారు. 253 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధుల్లో సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అక్కడి నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకొని సిబ్బంది అధికారులు ఏర్పాటు చేసిన ఆయా బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. వారికి అవసరమైన సూచనలు, ఆదేశాలను అధికారులు ఆదివారం అందజేశారు. రిసీవింగ్ కేంద్రంగా ఇబ్రహీంపట్నంలోని నోవా ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు.



రిజర్వులో అందుబాటులో ఉంచిన సిబ్బంది



సామగ్రిని సరి చూసుకుంటున్న పోలింగ్ సిబ్బంది

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. 253 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. అలాగే 153 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించి వాటికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా నిఘా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఎన్నికల విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేసే విధంగా చర్యలు తీసుకున్నాం.

–కిరణ్మయి, ఆర్వో, పశ్చిమం

ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి

జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్



మైలవరం: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్, మైలవరం నియోజకవర్గ ఎన్నికల అధికారి పి. సంపత్‌కుమార్ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగులకు ఎన్నికల సామగ్రిని ఆదివారం అందజేశారు. ఎన్నికల విధులకు హాజరవుతున్న ఉద్యోగులకు ఎన్నికల నిర్వహణపై ఆర్‌ఓ సంపత్ కుమార్ పర్యవేక్షణలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులకు హాజరవుతున్న ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. గతంలో 82 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, ప్రస్తుతం 90 శాతం పోలింగ్ జరిగేలా చర్యలు చేపట్టామని వివరించారు.

ముగిసిన గంగానమ్మ అమ్మవారి తిరునాళ్ల



నున్న(విజయవాడ రూరల్): గ్రామంలో ఐదు రోజులుగా జరుగుతున్న గంగానమ్మ అమ్మవారు తిరునాళ్ల ఆదివారం శాంతి కల్యాణంతో ముగిసింది. అశ్వద్ధ నాగలింగేశ్వరస్వామి వారికి శాంతి రుద్రాభిషేకం నిర్వహించారు. వైశాఖ శుద్ధపంచమి జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్య స్వామి వారి జయంతి, శ్రీ రామానుజాచార్య స్వామివారి జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలతో తిరునాళ్ల ముగిసింది.

కనీవినీ ఎరుగని అభివృద్ధి

ఐదేళ్లలో పశ్చిమంలో అనూహ్యమైన అభివృద్ధి

- రూ.450 కోట్లతో అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు
- కొనసాగుతున్న మరో రూ.50 కోట్లు విలువైన పనులు
- రూ.850 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో చేరిన సంక్షేమం
- విద్యా, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యం
- నియోజకవర్గంలో రూ.120 కోట్లతో అన్ని రహదారుల నిర్మాణం
- రూ.11 కోట్లతో కొండ ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్లు ఏర్పాటు
- పశ్చిమంలో 40 వేల మందికి సొంతింటి కలను నిజం చేసిన జగనన్న



చూడముచ్చటగా ఉన్న కేటీరోడ్డు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆయన అందించిన సహకారంతో పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీసింది. గడిచిన ఐదు దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేని అభివృద్ధి గడిచిన ఐదేళ్ల కాలంలో జరిగింది. నియోజకవర్గంలో ఎన్నడూ చూడని రీతిలో సంక్షేమం సైతం అబ్బురపరిచింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఇంత పెద్ద స్థాయిలో నిధులు నియోజకవర్గానికి చేరిన దాఖలాలు లేవు. ప్రధానంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించటంతో సుమారు రూ.1300 కోట్లకు పైగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ఈ ఒక్క నియోజకవర్గంలో అమలు జరిగినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

అర్హతే కొలమానం...

అర్హతే కొలమానంగా ఎక్కడా అవినీతికి తావు లేకుండా, పైరవీలకు అవకాశం లేకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనూ సంక్షేమ పథకాల నిధులు అందించింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు చొరవతో అనేక అభివృద్ధి పనులు పరుగులు తీశాయి. పార్టీలు, కులాలు, మతాలు ఇలా తారతమ్యం లేకుండా అర్హతల ఆధారంగా పథకాలు అమలయ్యాయి. ప్రధానంగా టీడీపీకి చెందిన నేతలు, కార్యకర్తలకు సైతం సంక్షేమ పథకాలు అందాయని ఆ నాయకులే బహిరంగంగా చెబుతున్నారు.

రూ.450 కోట్లకు పైగా అభివృద్ధి...

నియోజకవర్గంలో సుమారు రూ.450 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయి. మరో రూ.50 కోట్లకు పైగా విలువైన పనులు కొనసాగుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు రూ.120 కోట్లతో రహదారుల నిర్మాణం జరిగింది. సుమారు రూ.పది కోట్లతో ఆరు అర్బన్ ఆరోగ్య కేంద్రాలు, ఉన్న కేంద్రాల అభివృద్ధి పనులు నిర్వహించారు. రూ. 11 కోట్లతో 22 డివిజన్లలో నాలుగైదు దశాబ్దాలుగా ఉన్న మంచినీటి పైప్‌లైన్లను మార్చి కొత్త పైప్‌లైన్లు వేశారు. రూ.25 కోట్లతో వివిధ ఆలయాల పునర్నిర్మాణం, ఆలయాల అభివృద్ధి చేశారు. పాతబస్తీలో ఉన్న విద్యుత్ లైన్లను మార్చి నూతన విధానంలో కొత్త వైర్లను ఏర్పాటు చేశారు. సబ్ స్టేషన్ల ఏర్పాటు తదితర పనులకు సుమారు రూ.15 కోట్లు వెచ్చించారు. పశ్చిమ నియోజకవర్గం లేబర్ కాలనీలో స్టేడియం నిర్మాణానికి తొలి విడతగా ఆరు కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి. వాటితో పాటుగా నియోజకవర్గంలోని పార్కులు, గ్రీన్ బెల్టులు ఇలా అనేక వనాలను కోట్లాది రూపాయాలతో అభివృద్ధి చూసి ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని అందించారు. ఈ విధంగా గడిచిన ఐదేళ్ల కాలంలో జరిగిన ప్రగతి అద్భుతమని ప్రతి ఒక్కరూ వ్యాఖ్యానిస్తున్నారు.



రోటరీ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ ఆరోగ్య కేంద్రం

రూ.850 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో చేరిన సంక్షేమం....

నియోజకవర్గంలోని ప్రజలకు సుమారు రూ.850 కోట్ల మేర సంక్షేమ కార్యక్రమాల ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. వైఎస్సార్ చేయూత ద్వారా రూ.67.94 కోట్లు, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.88.75 కోట్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ రూ.19.59 కోట్లు, జగనన్న అమ్మ ఒడి ద్వారా రూ.27.36 కోట్లు, జగనన్న విద్యాదీవెన ద్వారా రూ.74.09 కోట్లు, జగనన్న వసతి దీవెన ద్వారా రూ.14.96 కోట్లు, జగనన్న తోడు ద్వారా రూ.18.48 కోట్లు, జగనన్న చేదోడు ద్వారా రూ.9.14 కోట్లు ఇలా సుమారు 25కు పైగా పథకాల ద్వారా నిధులు నియోజకవర్గ ప్రజల ఖాతాల్లో జమయ్యాయి.

నెరవేరిన సొంతింటి కల

ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఒక కల. జీవితంలో సొంతిల్లు సంపాదించాలనే కలను ప్రజలు నెరవేర్చుకోవటానికి శ్రమిస్తారు. దానిని సాకారం చేసేందుకు పేదలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సొంతింటిని అందించింది. నియోజకవర్గంలో సొంతిల్లు లేని సుమారు 42 వేల కుటుంబాలకు సొంతింటి కలను జగనన్న ప్రభుత్వం నెరవేర్చింది. జగనన్న కాలనీల్లో స్థలాన్ని కేటాయించటమే కాకుండా అందులో ఇంటి నిర్మాణాలను సైతం చేసి అందించింది.

సనాతన వైదిక ధర్మరక్షకుడు జగద్గురువు ఆదిశంకరులు

విజయవాడకల్చరల్: సనాతన వైదిక ధర్మరక్షకుడు జగద్గురు ఆదిశంకరులని ఆధ్యాత్మికవేత్త శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి అన్నారు. శృంగేరీ శారదాపీఠం (శివరామ కృష్ణ క్షేత్రంలో) 20 రోజులుగా నిర్వహిస్తున్న జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి జగద్గురువులు రచించిన ప్రస్థాన త్రయం అంశంగా ప్రసంగించారు. బ్రహ్మ సూత్రములు, శ్రీమదు భగవద్గీత, ఉపనిషత్తులను మూడింటినీ ప్రస్థాన త్రయంగా పిలుస్తారని వివరించారు. శంకరులు భారతీయ ఉపఖండంలో పర్యటించి శంక తత్వాని ప్రచారం చేశారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సంగీత విద్వాంసులు గౌరీనాథ్, గాయత్రి గౌరీనాథ్, మాధవీలు ఆదిశంకరులు రచించిన శ్లోకాలను గానం చేశారు. దేవాలయంలో ప్రత్యేకంగా నిర్మించిన వేదికమీద ఆదిశంకరుల విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్టా ల హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.



జగద్గురు ఆదిశంకరులకు పూజలు నిర్వహిస్తున్న అర్చక స్వాములు



ఆదిశంకరుల శ్లోకాలను గానం చేస్తున్న గౌరీనాథ్, గాయత్రి

బాబా మందిరంలో ఆదిశంకరాచార్య జయంతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం సాయంత్రం ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదిశంకరాచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్ ఆదిశంకరాచార్య జీవిత వృత్తాంతం, హిందూ మత పరిరక్షణకు ఆయన చేసిన సేవలను వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆదిశంకరాచార్య జయంతి వేడుకల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ఆదిశంకరాచార్య జీవిత విశేషాలు వివరిస్తున్న కుంచనపల్లి రవిశంకర్

సాయి మందిరంలో శివసప్తాహం



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీ షిర్డీ నాగ సాయిబాబా–నాగమానసాదేవి మందిరంలో ఆదివారం శివసప్తాహం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో మహాశివుడు, గణపతి, మహానంది మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించారు. విగ్రహాలకు ఈనెల నాలుగో తేదీ నుంచి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆరుద్ర నక్షత్రం కావడంతో మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో 108 లీటర్ల ఆవుపాలతో శివలింగాన్ని అభిషేకించారు. భక్తులు అన్నాభిషేకం, లక్షలాది పూలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మట్టి విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు



సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఆదివారం ఉదయం నుంచే ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పర్యవేక్షణలో అధికారులు ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి తరలింపు, రవాణా సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పూర్తి స్థాయిలో సామగ్రితో ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సుల్లో తరలివెళ్లారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఎన్నికల విధులకు వెళుతున్న ఉద్యోగులు



ఎస్ఎస్ఎం స్కూల్లో పోలింగ్ సిబ్బంది



ఉక్కపోయటంతో చిన్నారులను కూలర్ వద్దకు తీసుకొచ్చిన సిబ్బంది



ఈవీఎం మిషన్‌లు